వనమహోత్సవానికి సర్వం సిద్ధం


దామెరలో ఏపుగా పెరిగిన మొక్కలు


ఒగ్లాపూర్ నర్సరీలో పెంచుతున్న మొక్కలు

- నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు
- మండలంలో 23,100 నాటడమే లక్ష్యం
- గతంలో నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగాయంటున్న వనప్రేమికులు

దామెర : గ్రామాలను హరితవనాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతీ ఏడాది నాటుతున్న మొక్కలు పెరిగి వృక్షాలుగా ఎదగడంతో గ్రామాల్లో పచ్చదనం నిండుకుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టి వర్షాకాలం ఆరంభంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తుంది.

ప్రతీ గ్రామంలో నర్సరీల..

మండల వ్యాప్తంగా 14 గ్రామాలకు గాను అన్ని గ్రామపంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించి నాణ్యమైన విత్తనాలు నాటుతూ మొక్కలను పెంచుతున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రీన్ షెడ్లు ఏర్పాటు చేయడం, మొక్కలకు నీరు సంవృద్ధిగా అందించేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు తీసుకుంటున్నారు. ప్రతీ నర్సరీలో వనసేవకులను ఏర్పాటు చేసి వాటి సంరక్షణ బాధ్యతలు గ్రామపంచాయతీలు అప్పగించారు. వీటి నిర్వహణ కోసం ఉపాధి హామీ నిధులను వెచ్చిస్తున్నారు. మండల వ్యాప్తంగా 23,100 మొక్కలు నాటాలనే లక్ష్యంతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకనుగుణంగా గ్రామ పంచాయతీలకు టార్గెట్ విధించి మొక్కల పెంపకంపై దృష్టిసారిస్తున్నారు. ఎంపీడీఓ కల్పన, ఏపీఓ శారద నర్సరీల నిర్వహణను ఎప్పటికపప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పండ్లు, నీడనిచ్చే మొక్కల పెంపకం గ్రామాల్లోని రైతులకు, ప్రజలకు అవసరమైన మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. ఇందులో భాగంగా గానుగ, వేప, టేకు, మర్రి వంటి నీడనిచ్చె మొక్కలు పెంచుతున్నారు. అలాగే చింత, మామిడి, జామ, బత్తాయి, నిమ్మ వంటి పండ్ల మొక్కలతో పాటు పలు పూల మొక్కలను పెంచుతున్నారు. ఇళ్లలో నాటే మొక్కలతో పాటు అవెన్యూ ప్లాంటేషన్, రహదారుల వెంట, పల్లెప్రకృతి వనాల్లో మొక్కలు నాటేందుకు గాను అధికారులు స్థలాలను గుర్తిస్తున్నారు.


ల్యాదెళ్లలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీఓ మేన శ్రీను

జూన్ నాటికి మొక్కలు సిద్ధం చేస్తాం



మండలంలోని 14 నర్సరీల్లో 23,100 మొక్కలు పెంచుతున్నాం. నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్లు, పూల మొక్కలను పెంచుతున్నాం. వచ్చే జూన్ మాసం వరకు మొక్కలను సిద్ధం చేస్తాం. మొక్కలు నాటడంతో పాటు పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రణాళికలు రూపొందిస్తాం.

– శారద, ఏపీఓ

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


నడికూడ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజిరెడ్డి


ఎల్కతుర్తి : ముల్కనూరులో..

నడికూడ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటేశ్వర్లపల్లి చైతన్య గ్రామైఖ్య సంఘం, చౌటుపర్తిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. అనంతరం రాజిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన సన్న ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. మొదటి రకం వరి ధాన్యానికి రూ.2,320, రెండో రకానికి రూ.2,300 మద్దతు ధర కల్పిస్తున్నట్లు చెప్పారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవేందర్, ఏపీఎం రమాదేవి, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ పారాబాయిల్డ్ రైస్ మిల్లు ఆవరణలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హనుమకొండ జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి కొమురయ్య, సంఘం జనరల్ మేనేజర్ రామ్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. అనంతరం సంఘం రైస్‌మిల్లు, జిన్నింగ్ కాటన్ మిల్లును సందర్శించారు. సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ రవీంద్ర, సంఘం కార్యవర్గ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో కాంగ్రెస్ ఆర్భాటం

- బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

ఆత్మకూరు : మండల అభివృద్ధికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి సీసీ రోడ్లు నిర్మిస్తే కాంగ్రెస్ నాయకులు తమ ప్రభుత్వమే నిర్మించిందని ఆర్భాటం చేసుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని గుడెప్పాడ్‌లో మంగళవారం నూతనంగా నిర్మించిన రోడ్డు వద్ద ప్రధాని మోదీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలు, నిధుల వివరాలను ఇంటింటికి వెళ్లి తెలుపుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారం, ఆర్భాటం ఆపాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, కిసాన్ మోర్చా నియోజకవర్గ కోకన్వీనర్ బుచ్చిరెడ్డి, నాయకులు గోపాల్, సునీల్, నాగరాజు, మధు, రాహుల్‌రెడ్డి, దిలీప్, భిక్షపతి, రాంమోహన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం ఘనంగా జరిగింది. 1998–99బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, ఆంజనేయులు, కృష్ణమూర్తి, నాగేశ్వర్, విద్యార్థులు నవీన్‌కుమార్, బోయిన శ్రీనివాస్, ప్రసాద్, రాంబాబు, రజినీకాంత్, ప్రేమ్‌సాగర్, రాధిక, స్వర్ణ, సంధ్య, స్రవంతి పాల్గొన్నారు.

ఎర్రజెండా.. పేద ప్రజల అండ

మడికొండ : ఎర్ర జెండా పేద ప్రజల అండ అని భారత కమ్యునిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. మంగళవారం కాజీపేట మండలం మడికొండలోని రావి నారాయణరెడ్డి కాలనీలో గుగులోతు రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జ్యోతి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని విడగొట్టే చర్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలు ముస్లిం మైనార్టీ వ్యతిరేక చట్టాలు తీసుకొస్తూ ముస్లింల, రైతుల పైన, దళితులపై దాడులు కొనసాగించడానికి ప్రజాస్వామిక వాదులు తిప్పి కొట్టాలన్నారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ములకనూరు పీహెచ్‌సీ పరిధిలోని చంటయ్యపల్లి గ్రామంలో ఆశ కార్యకర్తగా పనిచేస్తున్న అందే స్వరూప ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ముల్కనూరు, వేలేరు, కడిపికొండ, సోమిడి, కొత్తకొండ ఆశ కార్యకర్తలు తలోకొంత జమ చేసి రూ.20,500 నగదును బాధిత కుటుంబానికి మంగళవారం అందించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌రెడ్డి అభినందించారు.

న్యాయవాదుల కో ఆపరేటివ్ సొసైటీ కమిటీ ఎన్నిక



వరంగల్ లీగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా న్యాయవాదుల కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా పీసరి రాము, ప్రధాన కార్యదర్శిగా గంధం సురేష్ ఎన్నికయ్యారు. మంగళవారం సమావేశమైన డైరెక్టర్లు 2025–26 సంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఉప్పు కృష్ణారావు, కోశాధికారిగా నాంసాని చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులకు సన్మానం

నయీంనగర్ : నూతనంగా ఎన్నికైన హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు పులి సత్యనారాయణ, వలుస సుధీర్, ప్రధాన కార్యదర్శులు కొత్త రవి, దండాపంతుల రమాకాంత్‌లకు శాలువాలు కప్పి గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ జ్ఞాపికలతో కార్యవర్గం సన్మానించింది. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగు స్తంభాల్లో భాగమైన జ్యూడీషియరీ, మీడియాలు సహకరించుకుంటూ సమాజానికి ఉపయోగపడేలా పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

వరంగల్ బార్ అధ్యక్షుడికి..

వరంగల్ లీగల్ : ఇటీవల వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన వలుస సుధీర్‌ను మంగళవారం జిల్లా కోర్టులోని అంబేడ్కర్ హాల్‌లో పోపా నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోపా రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్, వరంగల్ అధ్యక్షులు గుండు కామేశ్వర్, రాష్ట్ర ప్రతినిధులు సుధాకర్, రా జగోవింద్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, న్యాయవాదులు మహాత్మ, రాజ్‌కుమార్, సుభాష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

యూఎస్ఓ పోటీలో రవికుమార్ ప్రతిభ

హన్మకొండ : యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ నిర్వహించిన ప్రతిభ పాటవ పోటీల్లో మండలంలోని పలివేల్పుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెనిశెట్టి రవికుమార్ ప్రతిభకనబరిచారు. యూఎస్ఓ ఏర్పాటై 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫ్యూచర్ మీ అనే అంశంపై దేశవ్యాప్తంగా ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు పోటీ నిర్వహించారు. ఈ అంశంలో 500 మంది పాల్గొనగా ప్రతిభ కనబరిచిన 75 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఇందులో రవికుమార్ 35వ స్థానాన్ని పొందగా ప్రశంసాపత్రాన్ని యూఎస్ఓ అందజేసింది.

సీకేఎం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ధర్మారెడ్డి

దేశాయిపేట : దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏ.ధర్మారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మార్చి 31న ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానంలో కళాశాలలో కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ధర్మారెడ్డికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన ధర్మారెడ్డికి పలువురు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.

నియామకం

కాజీపేట రూరల్ : స్థానిక రైల్వే డీజిల్ లో కో షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న ఎస్.మోతీలాల్‌ను దక్షిణ మధ్య రైల్వే కార్మిక్ సంఘ్ (డీఎంఆర్‌కేఎస్) జోనల్‌స్థాయి నాయకులు రెండోసారి డీఎంఆర్‌కేఎస్ సికింద్రాబాద్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మోతీలాల్ మాట్లాడుతూ ఈ నెల 13న నాందేడ్‌లో జరిగిన డీఎంఆర్‌కేఎస్ జనరల్ కౌన్సిల్ మీటింగ్‌లో తనను న్యూఢిల్లీ బీఆర్ఎంఎస్ జనరల్ సెక్రటరి మంగేష్‌దేశ్ పాండే, బీఎంఎస్ అధ్యక్షుడు రాంమోహన్ సమక్షంలో రెండోసారి జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నట్లు తెలిపారు.

‘మీ సేవ’లో తిష్టవేసిన పాము

వరంగల్ : వరంగల్ కార్పొరేషన్ ఆవరణలోని మీసేవ కార్యాలయం వాష్‌రూంలో పాము ఉన్నట్లు ఉద్యోగులు మంగళవారం గుర్తించారు. పామును పట్టేందుకు వచ్చిన వ్యక్తి వాష్‌రూం గోడ పగుల్లో ఇరుక్కుపోయి ఉన్నట్లు గుర్తించాడు. పామును తీయాలంటే గోడలోని కొంత భాగం తొలగించాలని సూచించగా అందుకు ఉన్నతాధికారుల అనుమతి అవసరం కావడంతో వాయిదా పడింది. ఈ విషయాన్ని బల్దియా ఉన్నతాధికారులకు వివరించడంతో రేపటికి పామును పట్టే కార్యక్రమం వాయిదా పడింది. గోడలో ఇరుక్కపోయిన పాము ఎటూ కదలలేని పరిస్థితిలో ఉండడంతో వాష్‌రూంకు తాళం వేసి ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలి

ఖిలా వరంగల్: రైలు ప్రయాణికులు జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణం చేయాలని ఆర్‌పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రయాణికుల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. రైలులో కిటికీల వద్ద కూర్చొని ప్రయాణించే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని దండుగలు చోరీలకు పాల్పడటం, పిల్లలు రాళ్లతో విసిరివేయటం వల్ల ప్రయాణికులకు గాయాలవుతాయని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ షిండే పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ క్యాంపు

వరంగల్ : వరంగల్ కేఎంసీ పక్కనే ఉన్న బీఎస్ఎన్ఎల్ భవన్‌లో నేడు (బుధవారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కస్టమర్ సర్వీస్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డీజీఎం విజయ భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్ఎన్ఎల్ వివిధ సర్వీసులు, సమస్యలు పరిష్కరించబడతాయని, వినియోగదారులు ఈ అవకాశాలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

దేవన్నపేటలో సీపీఎం సర్వే

హసన్‌పర్తి : గ్రేటర్ పరిధిలోని 65వ డివిజన్ దేవన్నపేటలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం సర్వే చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్, ఇల్లు కూడా ఇవ్వలేదని స్థానికులు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అశోక్, మౌనిక, లలిత, రాజు, చిన్ని, రవీందర్, వెంకటయ్య, రాజయ్య పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్

స్థానిక పెద్ద చెరువు కట్టను బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. ప్రతి రోజు వందలాది మంది వాకర్స్ ఈ కట్టను వినియోగిస్తున్నారు. అయితే కట్టకు ఇరువైపులా పిచ్చిమొక్కలతో పాటు వ్యర్థ పదార్థాలు పడేయడంతో వాకర్స్ ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో వారు శుభ్రం చేశారు.

మత్తుకు యువత దూరంగా ఉండాలి

- సీఐ సంతోశ్



ఆత్మకూరు : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సీఐ సంతోశ్ అన్నారు. మండలంలోని నాగయ్యపల్లిలో మంగళవారం రాత్రి గంజాయి, మద్యం, గుట్కా ఇతర మత్తు పదార్థాల వలన కలిగే అనార్థాలపై పోలీస్ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. యువకులు మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లి భవిష్యత్‌ను నశానం చేసుకోవద్దని సూచించారు. ఎవరైనా గంజాయి అమ్మినా, సేవించినా 8712584473 నంబర్‌కు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, ఏఎస్సై నాగమణి, విలియం, వెంకటేశ్వర్లు, రత్న, పూల్‌సింగ్, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనను చీదరించుకుంటున్న ప్రజలు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనను ప్రజలు చీదరించుకుంటున్నారని, రానున్న రోజుల్లో ఆ పార్టీకి పతనం తప్పదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని పత్తిపాక, హుస్సేన్‌పల్లి, ప్రగతి సింగారం, అప్పయ్యపల్లి, నేరేడుపల్లి, నూర్జహాన్‌పల్లి, కాట్రపల్లి, కొప్పుల, వసంతాపూర్, గంగిరేణిగూడెం, సూర్యానాయక్‌తండా, సాధనపల్లి, రాజుపల్లి గ్రామాల్లో మంగళవారం పర్యటించి ఈనెల 27వ తేదీన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ భారీ బహిరంగ సభకు జన సమీకరణకు కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు, రుణమాఫీ చేయకుండా చేతులెత్తేసిందని దుయ్యపట్టారు. వేల కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపయోగంగా ఉంచడం సరికాదని, ఈ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కొంత మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ మీటింగ్‌కు వెళ్తే సంక్షేమ పథకాలు ఆపుదల చేస్తామని భయపెట్టడం హేయమైన చర్య అన్నారు. ప్రజలకు అర్థమయ్యేలా వివరించి సభకు తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు ఎన్ని ఇచ్చిందో చెప్పుకోలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. సన్నబియ్యం పేరుతో నూకల బియ్యం ఇస్తున్నారని ఆరోపించారు. రజతోత్సవ సభకు మండలం నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మండల, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

దామెర : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇండియన్ టాలెంట్ పరీక్షల్లో మండలంలోని ఒగ్లాపూర్‌లో గల డిస్నీల్యాండ్ పాఠశాల విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి తెలిపారు. రాష్ట్రస్థాయి సైన్స్, మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో, డ్రాయింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన కైరవ్‌కాంత్ 8వ, సామర్ల శ్రీవాణి 15వ, జిట్టబోయిన సస్మిత 18వ ర్యాంకులు సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గోల్డెన్ స్కూల్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, దయ్యాల రాకేశ్‌భాను, దీనేశ్‌చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

- సఖి లీగల్ కౌన్సిలర్లు శ్రీదేవి, అనూష

దామెర : మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని సఖి సంస్థ లీగల్ కౌన్సిలర్లు శ్రీదేవి, అనూష అన్నారు. మండలంలోని పులుకుర్తిలో మహిళలకు చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులు వేధింపులకు గురైతే వెంటనే సఖి సంస్థను సంప్రదించాలని అన్నారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాధిత మహిళలకు రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. సఖి సంస్థ కౌన్సెలింగ్, వైద్య సాయం, పోలీస్ సాయం, న్యాయ సాయం, తాత్కాలిక వసతి కల్పించడం వంటి సేవలు అందిస్తోందన్నారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసేచోట వేధింపులు, అత్యాచారాలు వంటి సమస్యలు ఎదుర్కొన్న మహిళలు 181, 1098 నంబర్లకు లేదా 08702452112, 7382983088 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. వీఓఏ స్వర్ణలత, అంగన్‌వాడీ సిబ్బంది సరళ, సంధ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సఖి సంస్థ ప్రతినిధులు

మంద కృష్ణ సన్మాన సభను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న సంజీవరావు

కమలాపూర్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగకు పుల్లా ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన మండల కేంద్రంలో సన్మాన సభ నిర్వహించనుందని, అందరూ హాజరై జయప్రదం చేయాలని రిటైర్డ్ ఏఎస్పీ సంజీవరావు, ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుల్లా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విజ్ఞాన భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేసి వర్గీకరణ సాధించే వరకు పోరాడిన మహోన్నత వ్యక్తి మంద కృష్ణమాదిగ అని కొనియాడారు. అంతటి మహోన్నత వ్యక్తిని పుల్లా ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించాలని నిర్ణయించామని, స్థానిక ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్లో జరిగే సన్మాన సభకు మండలం, జిల్లాలోని మాదిగలు, మాదిగేతరులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రముఖ గాయకులు, సామాజిక వేత్తలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, నాయకులు సంపత్, పుల్లా కొమురయ్య, శోభన్, శ్రీకాంత్, రాజు, డాక్టర్ కుమారస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ధర్మసాగర్ : మండల కేంద్రంలో ఏర్పడిన తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మిషన్ భగీరథ అధికారులతో వారు మాట్లాడారు. 8 నెలల నుంచి గ్రామంలో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మిషన్ భగీరథ వాటర్ ఫిల్టర్ ట్యాంకుల నుంచి బాలుర ఉన్నత పాఠశాల వెనకాల ఉన్న ట్యాంకులోకి నీటిని సరఫరా చేస్తున్న క్రమంలో చిన్నసైజ్ డైని ఏర్పాటు చేయడంతో ట్యాంకులోకి నీరు ఎక్కువగా రావడం లేదని తెలిపారు. ధర్మసాగర్ మేజర్ గ్రామ పంచాయతీ కారణంగా జనాభా ఎక్కువగా ఉంటుందని, డైని తొలగిస్తే ప్రజలకు సరిపడా నీళ్లు వస్తాయని అధికారులకు విన్నవించారు. దీంతో అధికారులు స్పందించి ట్యాంకులోకి నీళ్ల పోసే దగ్గర పెద్ద డై బిగించి గ్రామ ప్రజలకు సరిపడా తాగునీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్, మిషన్ భగీరథ ఈఈ రామాంజనేయులు, ఏడీ జీవన్‌ప్రకాశ్, ఏఈ సుధ, గ్రామస్తులు భరత్, శరత్, రవీందర్, రాజు, బొడ్డు లెనిన్, కొలిపాక రమేశ్, కొలిపాక మల్లిక్, శ్రీరాముల విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


తాగునీటి సమస్యను వివరిస్తున్న భరత్

గంజాయి పట్టివేత

నడికూడ : గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ నుంచి ముస్త్యాలపల్లికి ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ముస్త్యాలపల్లి బస్టాండ్ వద్ద అదే గ్రామానికి చెందిన బోనగిరి సుమన్ అనుమానంగా కనిపించినట్లు తెలిపారు. దీంతో అతడి బ్యాగ్ తనిఖీ చేయగా 16 గ్రాముల గంజాయి ప్యాకెట్ లభించగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ రూ.800 వరకు ఉంటుందని, పరకాల పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.